# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




అలాంటి పాత్రలు చేయను -సమంత

...సినిమాలో


తెలంగాణ ఎడిటర్: విప్పల చంద్రశేఖర్ | సోమవారం 11-11-2024 | పేజీలు: 8 | వెల : అమూల్యం




నాపై కోపం ఉంటే రాజకీయంగా నాపై కక్ష సాధించండి

# ప్రాజెక్టులను అడ్డుకోవద్దు



శ్రీ కురుమూర్తి స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి

- పాలమూరు జిల్లాలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన
- నేను ఈ జిల్లా అభివృద్దిని ఆకాంక్షించేవాడిని
- పేదల తిరుపతిగా కురుమూర్తి స్వామి
- వలసలు కొనసాగుతుండటం ఎంతో దురదృష్టకరం
- కొందరు చరిత్ర హీనులుగా మిగిలిపోక తప్పదు

2



మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపురంలోని కురుమూర్తి స్వామి జాతరకు హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి. కురుమూర్తి స్వామి దేవాలయానికి సమీపంలో ఘాట్ రోడ్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఓబీసీలను విభజించడానికి

# కాంగ్రెస్ యత్నిస్తోంది



- కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించకూడదు
- ఐక్యత ఉన్నప్పుడే భద్రత ఉంటుంది
- అధికారాన్ని చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్, జేఎంఎంలు ఎంతకైనా దిగజారుతాయి : ప్రధాని నరేంద్ర మోదీ

రాంచీ: ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్– జేఎంఎం ప్రయత్నిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించకూడదు అంటే ప్రజలు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఐక్యత ఉన్నప్పుడే భద్రత ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ఓబీసీలు, గిరిజనులు, దళితుల మధ్య ఐక్యత ఏర్పడనంత వరకు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూనే ఉందని పేర్కొన్నారు. "కాంగ్రెస్, జేఎంఎంలు పన్నే కుట్రల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. అధికారాన్ని చేజిక్కించుకోవడానికి అవి ఎంతకైనా దిగజారుతాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఐక్యతకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యూహాలు పన్నుతూ దేశాన్ని దోచుకుంది. (మిగతా 2వ పేజీలో)



# పెట్టుబడులు పెట్టండి

మలేషియా పారిశ్రామిక వేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

రాజకీయ ప్రస్థానానికి 25 ఏళ్లు

తెలంగాణ బియ్యాన్ని దిగుమతి మేము చేసుకుంటాం

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

తెలంగాణాలో తమ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన సులభతర వాణిజ్య విధానాలతో పరిశ్రమల స్థాపనకు దేశంలో మరెక్కడా లేనంత అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. మలేషియా తెలంగాణా దశాబ్ది ఉత్సవాలకు హాజరైన శ్రీధర్ బాబు ఆదివారం నాడు కౌలాంలపూర్ లో మలేషియా పారిశ్రమిక వేత్తలతో సమావేశమయ్యారు. స్థానిక తెలంగాణా ఎన్నారైలు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని ఆయన పారిశ్రమిక వేత్తలకు పిలుపునిచ్చారు. మలేషియా– భారత్‌ల మధ్య (మిగతా 5వ పేజీలో)




6

స్వల్ప లక్ష్యాన్ని

# ఛేదించిన దక్షిణాఫ్రికా..

పోరాడి ఓడిన భారత్



భాజపా ఉన్నంత వరకు మతపరమైన రిజర్వేషన్లు ఉండవు

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

5

కోలుకోలేని విధ్వంసం సృష్టించి

# విజయోత్సవాలా..?

- ఏడాది ఏలికలో తెలంగాణ బతుకు చీలికలు, పీలికలే
- విజయోత్సవం కాదు.. కుంభకోణాల కుంభమేళా
- మూసీలో రూ.లక్షన్న కోట్ల మూటల వేట
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2





4

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

ఆత్మహత్య చేసుకున్న నేతన్న దంపతుల కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్



ప్రజా విజయోత్సవాలు కాదు..

# ప్రజా వంచన ఉత్సవాలు చేసుకోండి

కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ సెటైర్లు

ఏడాది పాలనపై కాంగ్రెస్ పార్టీ ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించడంపైనా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బండి సంజయ్ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. ఏం సాధించారని ప్రజా విజయోత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు.

5

మీ వైఫల్యాలను మహారాష్ట్రలో

# ఎందుకు చెప్పలేదు..

- రుణమాఫీ బోగస్, రైతుబంధు బోగస్, వరికి బోనస్ బోగస్
- ఆరు గ్యారంటీలు గ్యారేజీకు పోయాయి
- రోడ్ల మీదున్న వడ్ల కుప్పలే.. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం
- హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు

2



కబ్జా చేసిన వారిని


# వదిలిపెట్టం..

మంత్రి పొంగులేటి మాస్ వార్నింగ్

5



ప్రజాభూమి



## నాపై కోపం ఉంటే రాజకీయంగా నాపై కక్ష సాధించండి

# ప్రాజెక్టులను అడ్డుకోవద్దు

- పాలమూరు జిల్లాలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన
- నేను ఈ జిల్లా అభివృద్ధిని ఆకాంక్షించేవాడిని
- పేదల తిరుపతిగా కురుమూర్తి స్వామి
- వలసలు కొనసాగుతుండటం ఎంతో దురదృష్టకరం
- కొందరు చరిత్ర హీనులుగా మిగిలిపోక తప్పదు

### శ్రీ కురుమూర్తి స్వామివారి బ్రహ్మోత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం అమ్మాపురంలోని కురుమూర్తి స్వామి జాతరకు హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి. కురుమూర్తి స్వామి దేవాలయానికి సమీపంలో ఘాట్ రోడ్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ కురుమూర్తి స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల తిరుపతిగా కురుమూర్తి స్వామి ఆలయం ప్రసిద్ధి పొందిందని అన్నారు. తెలంగాణ నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు ఇక్కడకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారని, భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.110 కోట్లతో ఘాట్ రోడ్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తున్నానని ముఖ్యమంత్రి ప్రజలకు తెలిపారు. వలసలకు మారుపేరు పాలమూరు జిల్లాగా పేరు పొందిందని, అలాంటి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణం గత పాలకుల నిర్లక్ష్యమేనని ఆయన విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చి పదేళ్లయినా ఇప్పటికే ఈ వలసలు కొనసాగుతుండటం ఎంతో దురదృష్టకరమని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేసి పాడిపంటలతో విలసిల్లేట్లు చేసేవిధంగా ప్రభుత్వ నిర్ణయాలుంటాయని, నారాయణ్ పెట్ కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేసి త్వరలోనే మక్తల్, నాగర్ కర్నూల్, కొడంగల్ ప్రాంతాలకు కృష్ణా జలాలు పారిస్తామని సభలో వెల్లడించారు. మా ప్రయత్నాన్ని అడ్డుకోవాలని కొందరు ఆరోపణలు చేసి చిల్లర రాజకీయాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదని.. నాపై కోపం ఉంటే రాజకీయంగా నాపై కక్ష సాధించండి తప్ప ప్రాజెక్టులను అడ్డుకోవద్దు.. జిల్లా అభివృద్ధిని అడ్డుకోవద్దు...అలా చేస్తే పాలమూరు జిల్లా ప్రజలు మిమ్మల్ని క్షమించరు.. మీరు చరిత్ర హీనులుగా మిగిలిపోక తప్పదు. నేను ఎక్కడ ఉన్నా.. ఈ జిల్లా అభివృద్ధిని కాంక్షించేవాడినేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు జిల్లాలో అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీలో 2వేల మంది స్థానిక నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏ కంపెనీలు వచ్చినా ఈ ప్రాంత నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని, జిల్లాలో గ్రామ గ్రామానికి, తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత తనదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఈ వేదికగా కలెక్టర్స్ కు ఆదేశాలు ఇస్తున్నానని వెల్లడించారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామని, కాళ్లల్లో కట్టెలు పెట్టి, కుట్రలు చేసి ఎవరైనా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే పాలమూరు బిడ్డలు ఎప్పటికీ క్షమించరని ముఖ్యమంత్రి రేవంత్ హెచ్చరించారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గాన మహబూబ్ నగర్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేరుకున్నారు.

# మీ వైఫల్యాలను మహారాష్ట్రలో ఎందుకు చెప్పలేదు..

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

తెలంగాణ డబ్బును రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు పంపుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలన గాలికి వదిలి.. గాలి మోటర్‌లో మంత్రు లు తిరుగుతున్నారని విమర్శించారు. నిజాలు చెప్పడానికి వెళ్లి.. మహారాష్ట్రలో రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పి వచ్చారని మండిపడ్డారు. రుణమాఫీపై మహారాష్ట్రలో సీఎం రేవంత్ చెప్పినవన్నీ అబద్దాలే అని స్పష్టం చేశారు. హైదరాబా ద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి రుణమాఫీ బోగస్, రైతుబంధు బోగస్, వరికి బోనస్ బోగస్ అని విమర్శించారు.కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు గ్యారేజ్‌కు పోయాయని హరీశ్‌రావు విమర్శించారు. రోడ్ల మీదున్న వడ్ల కుప్పలే.. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని అన్నారు. 2లక్షల ఉద్యోగాలు కల్పనపై మహారాష్ట్రలో పచ్చి అబద్దాలు చెప్పా రని పేర్కొన్నారు. విద్యార్థులను వీపులు పగలకొట్టించిన చరిత్ర కాంగ్రెస్ సర్కార్‌ది అని మండిపడ్డారు. 40లక్షల మందికి రుణమాఫీ చేశామని రేవంత్ అబద్దాలు చెప్పారని తెలిపారు. ఇంకా 22లక్షల మందికి రుణమాఫీ జరగాల్సి ఉందని.. పూర్తి రుణమాఫీ చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. రేవంత్ అబద్దాల ప్రవాహాన్ని మహారాష్ట్రలో కొన సాగించారని విమర్శించారు. తెలంగాణలో మోసం చేసిన ట్లు మహారాష్ట్ర ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.



ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని హరీశ్‌రావు అన్నారు. దాదాపు ఏడాది పూర్తవు తున్న ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని విమర్శించా రు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని.. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ ఇచ్చారని తెలిపారు. ఏ హామీలు అమలు చేశారో.. ఎక్కడ చర్చిద్దామో చెప్పండని.. ఆరు గ్యారెంటీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. అభయహస్తంలో మొదటి హామీ మహిళకు రూ. 2500 దిక్కులేదు మొదటి హామీకి దిక్కేలేదు.. మహారాష్ట్రలో కోతలు కోస్తున్నారని మండి పడ్డారు. మహిళలకు రూ. 2500 అమలు చేశావా? అని నిలదీశారు. ఒక్కో మ హిళకు రూ.27,500 ప్రభు త్వం బాకీ ఉందని.. కానీ రేవంత్ గ్లోబల్స్ ప్రచారం చేస్తు న్నాడని విమర్శించారు. మహారాష్ట్రకు వెళ్లి అన్ని అబద్దాలే ప్రచారం చేస్తున్నాడని.. మొదటి సంతకం ఏకకాలంలో రుణమాఫీ అన్నారని చెప్పారు.

రుణమాఫీపై మాట తప్పామని మహారాష్ట్ర ప్రజలకు చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. డిసెంబర్ 9 2023 రుణమాఫీ చేస్తా మని మాట తప్పామని మహారాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నా రు. 42 లక్షల మందికి రూ.31 వేల కోట్ల చేస్తామని.. రూ.17వేల కోట్లు మాత్రమే రుణ మాఫీ చేశారని అన్నారు.

# గ్రూప్-3 పరీక్షల హాల్ టికెట్లు విడుదల

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

తెలంగాణలో గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నెల 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష ఉండనుంది. ఈ పోస్టులకు 5.36 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు.

ఉదయం జరిగే పరీక్షలకు 9.30 తర్వాత, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2.30 అనంతరం పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని ఇటీవల టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ కాపీని భద్రంగా పెట్టుకోవాలని, తొలిరోజు పేపర్-1 పరీక్షకు హాజరైన హాల్‌టికెట్‌ను మిగతా పరీక్షలకు ఉపయోగించాలని పేర్కొంది. ప్రశ్నపత్రాలు, హాల్‌టికెట్లను నియామక ప్రక్రియ ముగిసేవరకు భద్రంగా పెట్టుకోవాలని సూచించింది.




# ఓబీసీలను విభజించడానికి కాంగ్రెస్ యత్నిస్తోంది

(మొదటి పేజీ తరువాయి)



ఛోటానాగ్‌పూర్ ప్రాంతంలో 125 కంటే ఎక్కువ ఉపకులాలు ఓబీసీలుగా పరిగణించబడుతున్నాయి. ఉపకులాలను ఒకదానితో ఒకటి ఇరకాటంలో పెట్టడం ద్వారా కాంగ్రెస్, జేఎంఎంలు ఓబీసీల ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని అనుకుంటున్నాయి. కాబట్టి ప్రజల్లో ఐక్యత ఉంటేనే భద్రత ఉంటుంది" అని ప్రధాని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు కోరుతున్నాయని..అది కానీ జరిగితే మళ్లీ మన సైనికులు ఉగ్రవాద దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తీసుకువచ్చారని, ఏడు దశాబ్దాలుగా అక్కడ రాజ్యాంగం అమలులో లేదని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం పేరుతో తొలిసారిగా జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేశారని, ఇదే అంబేద్కర్‌కు ఆయన అర్పిస్తున్న నివాళి అని మోదీ అన్నారు.

చొరబాటుదారులను తరిమికొట్టేందుకు, అవినీతి నిర్మూలనకు జార్ఖండ్‌లో భాజపా నేతృత్వంలోని ప్రభుత్వం అవసరమని ప్రధాని పేర్కొన్నారు. అధికార జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణం సృష్టించిన రిక్రూట్‌మెంట్ మాఫియా, పేపర్ లీక్ మాఫియాలను జైలుకు పంపుతామని, యువత భవిష్యత్తుతో ఆడుకున్న వారిని వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. రాష్ట్రంలోని హేమంత్ సోరెన్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ప్రధాని ఆరోపించారు. ఇండియా కూటమి ప్రజలను దోచుకుందని దుయ్యబట్టారు. భాజపా అధికారంలోకి వచ్చిన అనంతరం అవినీతికి పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దశాబ్ద కాలంగా జార్ఖండ్‌కు రూ.80,000 కోట్లు కేటాయించడానికి ఇబ్బందులు పడ్డారని..తమ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి రూ.3లక్షల కోట్లకుపైగా నిధులు మంజూరు చేసిందని ప్రధాని వెల్లడించారు.

# కోలుకోలేని విధ్వంసం సృష్టించి విజయోత్సవాలా..



**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా విజయోత్సవాలను నిర్వహించా లన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. ఎనుముల వారి ఏడాది ఏలికలో తెలంగాణ బతుకు చీలికలు, పీలికలే అని మండిపడ్డారు. కోలుకోలేని విధ్వంసం సృష్టించి విజయోత్సవాలా అని ప్రశ్నించారు. ఇది విజయోత్సవం కాదని, కుంభకోణాల కుంభమేళా అని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీకి పాతరేసినందుకు జరపాల్సింది విజయోత్సవాలు కాదు.. ప్రజావంచన వారోత్సవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీలో రూ.లక్షన్న కోట్ల మూటల వేట, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్‌లో రూ.వేల కోట్ల కాసుల వేట, బావమరిదికి అమృత్ టెండర్లు, మంత్రుల కుమారులకు రూ.వేల కోట్ల కాంట్రాక్టులని విమర్శించారు. సీఎం, మంత్రులు చేసుకోవాల్సింది విజయోత్సవాలు కాదు.. కరప్షన్ కార్నివాల్ అంటూ మండిపడ్డారు. పరిపాలనా వైఫల్యాలకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కారంటూ విమర్శించారు. సంక్షోభం తప్ప సంతోషం లేని పాలనకు చిరునామా రేవంత్ సర్కార్ అని నిప్పులు చెరిగారు. ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. పేదల ఇండ్లు కూల్చి రోడ్డున పడేసిన కాంగ్రెస్ సర్కార్‌కు అసలు మనసే లేదంటూ ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

ఏడాది కాలంగా ప్రతిరోజూ పరిపాలనా వైఫల్యాలకు కేరాఫ్ కాంగ్రెస్ సర్కారు. సకల రంగాల్లో సంక్షోభం తప్ప సంతోషం లేని సందర్భాలకు చిరునామా రేవంత్ పాలన. మరి, ఏ ముఖం పెట్టుకుని విజయోత్సవాలు నిర్వహిస్తారు. ప్రజలకిచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల్లో ఒక్కటంటే ఒక్క వాగ్దానం కూడా సరిగ్గా అమలుచేయకుండా జనం పైసలతో 25 రోజులపాటు జల్సాలు చేసుకుంటారా?.

రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం అందక పేద రైతులు దుఖంలో ఉంటే మీరు వందల కోట్లతో విజయోత్సవాలు చేసుకుంటారా?. హైడ్రా, మూసీ బాధితులు బాధలో ఉంటే మీరు బాజాభజంత్రీలతో పండుగ చేసుకుంటారా?. ఆడబిడ్డలు రక్షణ లేక అల్లాడుతుంటే మీరు విజయోత్సవాల పేరిట విర్రవీగుతారా?. వృద్ధులు పింఛన్ల పెంపు కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తుంటే మీరు దయలేకుండా దావత్ లు చేసుకుంటారా?. బీఆర్ఎస్ భర్తీచేసిన ఉద్యోగాల ప్రక్రియను మీ ఖాతాలో వేసుకోవడం నయవంచన కాదా ?. పావుశాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండా వందశాతం చేశామని చెప్పుకోవడం దగా కాదా?. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే సిలిండర్ పథకాలకు సవాలక్ష ఆంక్షలు పెట్టి మెజారిటీ అర్హులను దూరం చేయడం మోసం కాదా?.75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో అతితక్కువ సమయంలో అత్యధిక ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న తొలి ప్రభుత్వం, ఏకైక రాష్ట్ర ప్రభుత్వం ఇదే.

ఈ ముఖ్యమంత్రికి పాలనపై పట్టు కాదు.. ఈ ప్రభుత్వానికి తెలంగాణపై ప్రేమలేదు. పేదల ఇళ్లు కూల్చి రోడ్డున పడేసిన కాంగ్రెస్ సర్కారుకు అసలు మనసే లేదు. విజయోత్సవాలు అంటే ఏంటో కూడా తెలియని ఈ అసమర్థ పాలకులకు ఆ పదాన్ని వాడే హక్కే లేదు.' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# మత్స్యకారుల అభ్యున్నతికి రేవంత్ సర్కార్ ముందడుగు



**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

చేపల పెంపకం, విక్రయాల అధ్యయనం కోసం తెలంగాణ ప్రభుత్వ స్టడీ టూర్మూడు రోజుల పాటు కర్ణాటకకు తెలంగాణ అధికారులుతెలంగాణ ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో నవంబర్ 11 నుండి 13 వరకు బెంగుళూరు, మైసూరు తదితర ప్రాంతాల్లో మూడు రోజుల క్షేత్రస్థాయి పర్యటనఅన్ని రాష్ట్రాల కంటే తెలంగాణల అదర్శవంతమైన పాలసీ ఉండాలని సీఎం ఆదేశం. గత పదేండ్లలో చేపల పెంపకం పేరుతో బీఆర్ఎస్ నాయకులు కోట్లాది రూపాయలు లూటీ చేసినట్లు పేర్కొన్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్.పలు రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత రాష్ట్రంలో నూతన పాలసీ తేనున్న తెలంగాణ సర్కార్.

ప్రజాభూమి

# రైస్ మిల్లుల్లో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మిక తనిఖీలు

**ప్రజాభూమి ప్రతినిధి, వేములవాడ రూరల్**

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యం లారీలు ఎప్పటికప్పుడు దించుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. వేములవాడ మండలం మర్రిపల్లిలోని మారుతి, మణికంఠ, మహాలక్ష్మి రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశిలించినారు. ఈ సందర్భంగా మిల్లుల యజమానులతో మాట్లాడారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. జిల్లాలో ఐ.కే.పీ, మెప్మా, పీ.ఏ.సీ.ఎస్, డీ.సీ.ఎం.ఎస్. విభాగాల ఆద్వర్యంలో ఇప్పటికే 248 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు.అదేవిధంగా సీ.సీ.ఐ. ఆద్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. వరి, పత్తి పండించిన రైతులు తమ పరిధిలోని కేంద్రాలకు పంట ఉత్పత్తులను తరలించాలని సూచించారు. సరైన తేమ శాతంతో ధాన్యం, పత్తి తరలించి, మద్దతు ధర పొందాలని కోరారు. మిల్లర్లు సహకరించి, ధాన్యం దించుకోవాలని పేర్కొన్నారు.





# రంగవల్లి విజ్ఞాన కేంద్రం
## ప్రారంభోత్సవానికి తరలిరండి

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ**

కామ్రేడ్ రంగవల్లి 25వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు వేములవాడ పట్టణంలోని నంది కమాన్ వద్ద రంగవల్లి విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉందని, సభ్యులు, ప్రజా గాయకురాలు, అరుణోదయ సాంస్కృతిక సమైక్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. అందరు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మీడియా సమావేశంలో కోరారు....



# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో
## ఉచిత వైద్య శిబిరం

**ప్రజా భూమి ప్రతినిధి, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని ఆర్యవైశ్య వాసవి నిత్యాన్న సత్రం మరియు పట్టణ ఆర్యవైశ్య సంఘం గార్ల ఆధ్వర్యంలో పట్టణ ఆర్యవైశ్య వాసవి కళ్యాణ మండపంలో యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ మరియు మాతృశ్రీ మల్టీస్పెషల్టి హాస్పిటల్ వారి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం లో గుండె క్యాన్సర్ వ్యాధులు, ఊపిరితిత్తులు, మెదడు, నరాలు ,ఎముకలు ,జీర్ణాశయ వ్యాధులు, సాధారణ వ్యాధులకు గాను సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ మనోహర్ రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ హాస్పటల్ డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్, డాక్టర్ ఆర్ ప్రవీణ్ కుమార్, బుస్స శ్రీనివాస్ ,కొత్త పెల్లి శ్రీనివాస్, కట్కమ్ కిషన్, కట్కమ్ జనార్ధన్ ,సిద్ధంశెట్టి వేణు ,దైతా సతీష్ లు పాల్గొన్నారు .ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన వచ్చిందని మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని నిర్వాహకులు తెలిపారు.

# సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద
## నాగదేవత విగ్రహం లభ్యం

**ప్రజా భూమి ప్రతినిధి,తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్తులు నోముల అనిల్ గౌడ్,నోముల భూమయ్య,ట్రాక్టర్ డ్రైవర్ లక్ష్మణ్ లు సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద అభివృద్ధి పనుల కోసం బ్లెడ్ ట్రాక్టర్ తో చదును చేస్తున్న తరుణం లో వెలువడిన నాగదేవత విగ్రహం పంచలోహాలతో బంగారు వర్ణంతో కలిగి ఉందని తెలిపారు. అనంతరం ఆ విగ్రహాన్ని గ్రామంలోని రామాలయంలో ఉంచారని పేర్కొన్నారు.



# బాధిత కుటుంబాలకు రావుల రమేష్ పరామర్శ

**ప్రజా భూమి ప్రతినిధి, తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలంలోనీ మొగిలిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పసిక రవీందర్ రెడ్డి,ఎలుక పర్శరాములు వారి బంధువులు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబాలను బీ ఆర్ ఎస్ మండలాద్యక్షుడు రావుల రమేష్ స్థానిక నాయ కులతో కలిసి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మక్తపల్లి గ్రామానికి చెందిన దోనపాటి సంజీవ రెడ్డి,గంట హరీష్ ఇటీవల మృతి చెందగా పెద్దదిక్కు కోల్పో యిన బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ఒక్కొ క్కరికి 50 కిలోల చొప్పున బియ్యం అందజేశారు.

తండ్రిని కోల్పోయిన దుఃఖంలో ఉన్న వారి కూతురికి రమేషన్న కాను క పేరుతో ఐదువేలు అందిస్తానని తెలిపారు.

వారి వెంట బీఆర్ఎస్ మండల నాయకులు బేతి శ్రీనివాస్ రెడ్డి, రమేష్, కొమురయ్య, అశోక్ రెడ్డి,సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న
## నేతన్న కుటుంబానికి కేకే పరామర్శ

### కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా అందజేత

**ప్రజాభూమి ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల జిల్లా**




అప్పుల బాధలు,ఆర్థిక ఇబ్బందులు భరించలేక సిరిసిల్ల పట్టణంలోని 37వ వార్డు, వెంకంపేటకు చెందిన నేతన్న దంపతులు బైరి అమర్-స్రవంతి దంప తులు శనివారం సాయంత్రం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.ఈ విషయం తెలుసుకుని ఆదివారం సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియో జకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బైరి అమర్-స్రవంతి దంప తుల చితి మంటలు ఆరకముందే ఇచ్చిన మాట తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తరపున 5లక్షల రూపాయల ఎక్స్గ్రేషియే ఇప్పించారు.అలాగే పిల్లల చదువులకు కూడా ప్రభుత్వమే భరించేలా నా వంతు కృషి చేస్తాను అని కేకే మహేందర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీయస్ అభ్యర్థులనే గెలిపించుకోవాలి

### దాముక కమలాకర్ రాష్ట్ర అధ్యక్షులు

**ప్రజాభూమి ప్రతినిధి, బెజ్జంకి**



త్వరలో రాష్ట్రంలో జరగనున్న కరీంనగర్,ఆదిలాబాద్,నిజామాబాద్,మెదక్ నియోజకవర్గాల ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా,ఈ సారి సిపిఎస్ అభ్యర్థులు పోటీచేస్తారని రాష్ట్ర అధ్యక్షులు దాముక కమలాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామంచ రవీందర్ తో కలిసి పత్రిక ప్రకటన లో తెలిపారు. వారు మాట్లాడుతూ సీపీయస్ అభ్యర్థులని ఎమ్మెల్సీ గా గెలిపించాలని,గత ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్సీ లు సీపీయస్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దుకు పోరాడతామని హామీ ఇచ్చి కనీసం సీపీయస్ రద్దుకు ఒక్క దరఖాస్తు కూడా ప్రభుత్వానికి ఇవ్వలేదని,ఈ సారి ఎన్నికల్లో సీపీయస్ ఉద్యోగుల పక్షాన,సీపీయస్ అభ్యర్థులనే నిలబెడతామని,వారినే గెలిపించాలని దాముక కమలాకర్ తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఆర్డీఓ రమేష్

**ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్**



ముస్తబాద్ మండలంలోని గూడెం గ్రామంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలైన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిరిసిల్ల ఆర్డీవో ఎల్ రమేష్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలేత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద నీళ్లు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.చలువ పందిళ్లు వేయాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు.



# అపోహలు వద్దు,
## సర్వేకు సహకరించండి

### ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి, ముస్తాబాద్**

ముస్తాబాద్ మండల కేంద్రంలో ఇంటింటా జరిగే సమగ్ర సర్వే కార్యక్రమంలో అధికారులతో పాటు ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ళ బాల్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నటువంటి కులగణన సర్వే, కుటుంబ సమగ్ర సర్వేకి అందరూ సహకరించాలని,అపోహలు చెందాల్సిన అవసరం లేదన్నారు.ఇందులో వివరాలు చెప్తే భూమి,ఇల్లు పోతుందని అపోహ చెందవలసిన అవసరం లేదన్నారు.ఇది కేవలం మన సామాజిక స్థితి తెలుసుకోవడం కోసం జరుగుతున్నటువంటి సర్వే దానికి ప్రజలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని మీ వివరాలు ఎన్యుమరేటర్ కి అందజేయవలసిందిగా కోరుచున్నామని అన్నారు.అయితే ముఖ్యంగా కొంతమంది వేరే పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని,ఈ సర్వే చేయడం వల్ల అది గుంజుకుంటారు ఇది గుంజుకుంటారు అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఏమి గుంజుకోరు .. గతంలో మాదిరి సర్వేలాగా ఇది కూడా అని,పేదవాళ్ల బ్రతుకులు మార్చుడం కోసం జరుగుతుందని కావున ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాల్గొనవలసిందిగా బాల్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల స్పెషల్ ఆఫీసర్ లత,మండల ఎంపీడీవో బీరయ్య, మండల ఎమ్మార్వో సురేష్,గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్,మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్,సీనియర్ నాయకులు ఉచ్చిడి బాల్ రెడ్డి,ఎన్ ఎస్ యు ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిడిదొడ్డి భాను కుమార్, బద్దిపడిగే కళ్యాణ్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# చెత్తతో నిండిపోయిన
## గుడి చెరువు..

**ప్రజా భూమి ప్రతినిధి వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి గుడి చెరువు చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. వీఐపీ వాహనాలు వచ్చే దారిలో దుర్గంధంతో స్వాగతం పలుకుతోంది. గుడి చెరువును శుద్ధి చేయాలని స్థానికులు కోరిన ఎవరూ పట్టించుకోవట్లేదని ఆవేదన చెందుతున్నారు.ఆ దారి వెంట వెళ్లే భక్తులు ముక్కు మూసుకుని వెళ్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శుద్ధి చేయాలని భక్తులు కోరారు.



# రాజన్న ఆలయానికి
## కార్తీక శోభ

**ప్రజా భూమి ప్రతినిధి, వేములవాడ**

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి సన్నిధానంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. హరిహరులకు ఇష్టమైన మాసం కార్తీక మాసం కావడంతో భక్తులు కుటుంబ సమేతంగా కార్తీకదీపాలు వెలిగించి సేవలో తరిస్తున్నారు. స్వామివారి కరుణ కటాక్షాలు కార్తీక మాసంలో పూజలు చేసిన వారికి దక్కుతాయని శాస్త్రాలు చెబుతున్నాయని అర్చకులు తెలిపారు. దీంతో కార్తీకమాసంలో ఆలయాలకు భక్తులు అధికంగా వస్తారు.

ప్రజాభూమి



# అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

### ఆత్మహత్య చేసుకున్న నేతన్న దంపతుల కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

**ప్రజాభూమి ప్రతినిధి ముస్తాబాద్**

సిరిసిల్ల పట్టణంలో శనివారం సాయంత్రం ఆత్మహత్య చేసుకున్న నేతన్న దంపతులు అమర్-స్రవంతి కుటుంబాన్ని ఆదివారం సాయంత్రం సిరిసిల్ల శాసనసభ సభ్యులు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. వారి ముగ్గురు పిల్లలు చదువుకున్నంత వరకు తన పిల్లల మాదిరి చదివిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. పిల్లల ఒక్కొక్కరి పేరు మీద రెండు లక్షల రూపాయల చొప్పున ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తానని, వారికీ పూర్తిగా అండగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ విడుదల చేసి బీసీలను ఆదుకుంటాం అని మోసం చేసిందని సిగ్గు,లజ్జ ఉంటే నేత కార్మికులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పదకొండు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని,బతుకమ్మ చీరల కాంట్రాక్టు రద్దు చేయడం వల్లే ఇక్కడ నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు.



# ముంబై హైవే పై భారీ అగ్ని ప్రమాదం

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**

హైదరాబాద్-ముంబై హైవేపై కార్లను రవాణా చేస్తున్న కంటైనర్‌లో భారీ అగ్నిప్రమాదం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్ రోడ్డులో కార్లను తరలిస్తున్న కంటైనర్‌లో మంటలు చెలరేగడంతో హైదరాబాద్-ముంబై హైవేపై ట్రాఫిక్ జామ్‌తోపాటు అపార నష్టం వాటిల్లింది. ముంబై నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఎనిమిది కార్లతో వెళ్తున్న కంటైనర్‌లో మంటలు చెలరేగిన ఘటన రంజోల్‌లో చోటుచేసుకుంది. కంటెయినర్ నుండి దట్టమైన నల్లటి పొగలు వ్యాపించడంతో మంటలు లోపల ఉన్న వాహనాలను చుట్టుముట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అగ్నిమాపక దళం ప్రయత్నాలు చేసినప్పటికీ, తీవ్రమైన మంటలను అదుపు చేయడం కష్టం, ఫలితంగా కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మంటలు హైవేపై ట్రాఫిక్ జామ్‌కు దారితీశాయి, అత్యవసర బృందాలు సైట్‌ను క్లియర్ చేయడానికి మరియు డ్రైవర్ భద్రతను నిర్ధారించడానికి పని చేయడంతో వాహనాల సంఖ్యను ఆపివేయవలసి వచ్చింది. ప్రమాదం తర్వాత అధికారులు అదుపు చేయడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఆలస్యమయ్యారు.

# సరూర్ నగర్‌లో కాల్పుల కల కలం

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**



సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటేశ్వరా కాలనీ రోడ్డు నెంబర్ 14 లో మల్లికా రాణి అపార్ట్మెంట్లో ఎయిర్ గన్ తో అమ్మాయి తండ్రి రేవంత్ ఆనంద్ (57) పై కాల్పులు జరిపిన ప్రియుడు కంటిలో నుండి వెళ్లిన రౌండ్. వివరాల లోకి వెతితే అంబర్పేట్ కి చెందిన బల్విందర్ సింగ్ (25) మన్వీత (23) ఇద్దరు గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు. ఇంట్లో తెలిసి అమ్మాయి తండ్రి అమ్మాయిని ఈ మధ్యనే ఎవ్వరికి తెలియకుండా అమెరికాకు పంపించిన తండ్రి. విషయం తెలుసుకున్న బల్విందర్ సింగ్ ఈ విషయంపై అమ్మాయి తండ్రి రేవంత్ ఆనంద్ ( 57) తో ఇంటికి వచ్చి వాగ్వాదం దిగడంతో ఎయిర్ గన్ తో ఒక రౌండ్ కాల్పులు జరిపిన బల్విందర్ సింగ్. కంటిలో నుండి దూసుకెళ్లిన బుల్లెట్ . ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు. ఆసుపత్రికి తరలించిన పోలీసులు.

# ఫ్యూచర్ సిటీకి జర్నలిస్టుల విజిట్

- డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధుల ప్రత్యేక సందర్శన
- అక్కడ ఇంటి స్థలానికి ఆసక్తి చూపిన పాత్రికేయులు
- రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు... ఆరు నెలల్లో ఇవ్వాలని విన్నపం

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**




డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) సభ్యులు వందలాదిమంది ఆదివారం ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)ని ప్రత్యేకంగా సందర్శించారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో డీజేహెచ్ఎస్ సభ్యులు అక్కడ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఫోర్త్ సిటీలో ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అందుకోసం చొరవ చూపిన సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఫోర్త్ సిటీని సందర్శించిన జర్నలిస్టులు అక్కడి వాతావరణం పట్ల ఆసక్తి చూపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు దండ రామకృష్ణ, దేగ కుమార్, నాగరాజు మాట్లాడారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వీలైనంత త్వరగా ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి నిర్ణయం తమకు ఆమోదయోగ్యమని స్పష్టం చేశారు. ఆరు నెలల్లోగా ఇచ్చేలా కసరత్తు చేయాలని ముఖ్యమంత్రికి డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి సూచించారు. హైదరాబాద్ కు ఇది నాలుగో సిటీగా అభివృద్ధి అవుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే అక్కడ అమెజాన్ డేటా సెంటర్ ఉందన్నారు. స్కిల్ యూనివర్సిటీ, వరల్డ్ ట్రేడ్ సెంటర్ రాబోతున్నాయన్నారు. నెట్ జీరో వల్ల కాలుష్య రహిత ప్రాంతంగా ఉంటుందన్నారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి తదితర ప్రాంతాలకు ధీటుగా ఇది అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తుందన్నారు. అందువల్ల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అక్కడ ఇస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీకి మెట్రో రైలు మార్గం కూడా రానున్నందున ప్రయోజనం ఉంటుందన్నారు. ఇళ్ల స్థలాల విషయంలో జర్నలిస్టులంతా ఐకమత్యంతో ఉండాలని కోరారు. ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున దాన్ని సాధించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ జాతీయ మాల మహానాడు అధ్వర్యంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన మహా పాదయాత్ర ఆదివారం తిమ్మాపూర్ మండలం అలగునూర్ కు చేరుకుంది.. ఈ పాదయాత్రలో గన్నేరువరం మండలానికి చెందిన మాల మహానాడు నేతలు తుమ్మ ప్రభాకర్ పాల్గొని పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా తుమ్మ ప్రభాకర్ మాట్లాడుతూ మాలలు అందరూ ఐక్యంగా ఉండి ఎస్సి వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకించాలని, అవసరమైతే పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

– ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం

# జంగపల్లి గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం:**

మండలంలోని జంగపల్లి గ్రామంలో గౌడ సంఘం సభ్యులు ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు గా అటికం రాజారాం గౌడ్, అధ్యక్షుడు గా బుర్ర కనకయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు గా అటికం రామచంద్రం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా అటికం తిరుపతి గౌడ్, కోశాధికారిగా బుర్ర సంపత్ గౌడ్, రంగం తిరుపతిలను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అటికం శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ అటికం రాజేశం గౌడ్ తో పాటు గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# అయ్యా ముఖ్యమంత్రి గారు వ్యవసాయాన్ని కాపాడండి

- రైతులకు ఏదీ ఫ్రీగా ఇవ్వాల్సిన అవసరం లేదు
- రైతుల పంటకు మద్దతు ధర ఇవ్వండి చాలు
- ఓ రైతు బిడ్డ సీఎంకు బహిరంగలేఖ

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**

అయ్యా.,.!

రైతులకు ఎరువులు ఉచితం, వ్యవసాయానికి కరెంటు ఉచితం, రుణ మాఫీ, విత్తనాలు సబ్సిడీ ఈ ప్రభుత్వంలో రైతులకు అన్నీ ఫ్రీ..వీరికి ఇంకేం కావాలి అని ప్రజల ఆలోచన. 70శాతం వ్యవసాయంపై ఆధార పడ్డవారే , కాని వీరికి ఇంతకంటే ఎక్కువ ఏం కావాలి..అన్ని ఫ్రీ ఫ్రీ ఫ్రీ అని ప్రభుత్వ ఆలోచన. కానీ నేను ఒక రైతు బిడ్డగా చెబుతున్నా..మా రైతులకు ఏది ఫ్రీ ఫ్రీ ఫ్రీ గా ఇవ్వాల్సిన అవసరం లేదు అని విన్నవిస్తున్నా. ఎందుకంటే అంగన్ వాడి కార్యకర్తలను టీచర్లుగా ఎలా గుర్తించి రూ.4 వేలు జీతం నుండి రూ.10 వేలు జీతంగా పెంచారో, సర్పంచ్‌లకు రూ.1,500ల జీతం నుంచి రూ. 5 వేలు చేసారో , రూ. 75 వేల జీతం ఉన్న ఎమ్మెల్యేల జీతం రూ.1.50లక్షలు చేశారో, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను ఏ విధంగా పెంచారో , అదే విధంగా , అదే శాతంతో సమానంగా రైతు పండించిన పంటకు ధరను నిర్ణయించి , ప్రభుత్వమే కొనుగోలు చెయ్యాలి.

**ఎందుకు కొనుగోలు చెయ్యరు ప్రశ్నిద్దాం, పోరాడుదాం**

లక్ష రూపాయల జీతం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రోగం వస్తే హాస్పిటల్ లో ట్రీట్మెంట్ ఫ్రీ, అతని పిల్లలకి ఫ్రీ , అతని భార్యకు ఫ్రీ, అతని తల్లిదండ్రులకు కూడా ఫ్రీ. వారికి ఆఫీస్ టైం ఉదయం9గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు. కచ్చితంగా టైం టూ టైం వెళతారు, వస్తారు. మరి రైతు లేనిదే రాజ్యం లేదు , రైతే రాజు , రైతు లేకుండా జీవించలేము, జై జవాన్ జై కిసాన్ , రైతు ఏడ్చిన రాజ్యం లేదు , ఎద్దు ఏడ్చిన ఎవుసం లేదు అని చెపుతున్న రాజకీయ నాయకుల్లారా.. రాత్రనక , పగలనక, ఏ టైం లేకుండా, ఎప్పుడు పడితే అప్పుడు పొలానికి వెళ్లిన రైతు, తిరిగి వస్తాడో, లేదో తెలియక, ఇంటి దగ్గర ఎదురు చూసే భార్య , పిల్లలు , పంటకు రోగం , మనిషికి రోగం వస్తే ఎక్కడ చూపియ్యాలో తెలియక, అప్పు చేసి, దిగుబడి తగ్గి కుంగిపోయే రైతులకు ఇస్తే ఫ్రీ అంటారు. ఉద్యోగులకు ఇస్తే ఇంక్రిమెంట్ అంటారు.





## సర్పంచులు.. ఎంపీటీసీలు.. జడ్పీటీసీల
# సమస్యలు పరిష్కరిస్తాం
### డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హామీ

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి,**

రాష్ట్రంలోని పంచాయితీల్లోని సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఆదివారం మంగళగిరలోని పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈసందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు ఎదుర్కొంటున్న సమస్యలను పవన్ కళ్యాణ్ కు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్ వివరించారు. దాదాపు రెండున్నర గంటల సేపు జరిగిన ఈ భేటీలో గ్రామపంచాయితీలు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దాదాపు 26 డిమాండ్లను పవన్ కళ్యాణ్‌కు ఒక వినతిపత్రం రూపంలో అందజేశారు. వాటి పరిశీలించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సానుకూలంగా స్పందించి, ఈ 26 డిమాండ్ల పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

డిప్యటీ సీఎంకు అందజేసిన డిమాండ్లలో ప్రధానంగా గ్రామ సచివాలయాలను గ్రామపంచాయతీలలో విలీనం చేసి సర్పంచుల ఆధ్వర్యంలో అన్ని రకాల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేవలం 3వేల రూపాయలుగా ఉన్న సర్పంచ్, ఎంపీటీసీల గౌరవ వేతనాన్ని 15 వేలకు పెంచాలని 6 వేల రూపాయలుగా ఉన్న ఎంపీపీ, జడ్పిటిసి ల గౌరవ వేతనాన్ని 30 వేలకు పెంచాలని డిప్యూటీ సీఎంను ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్ కోరారు. రాష్ట్రంలోని మైనర్ గ్రామ పంచాయతీలకు విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. క్లాప్ మిత్రలకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలే జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు వారి కుటుంబాలతో తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనానికి వెళితే సంవత్సరంలో ఒకసారి ప్రోటోకాల్ దర్శనం ఇప్పించగలరని కోరారు. వీటితో పాటు మరో 6 డిమాండ్లను డిప్యూటీ సీఎంకు అందజేశారు.

డిమాండ్లను వివరించిన అనంతరం ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా 4500 కోట్ల రూపాయలు గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి పనులకు విడుదల చేసినందుకు రాజేంద్రప్రసాద్ పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు తనకు అందజేసిన డిమాండ్లపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మీరు పెట్టిన ఈ డిమాండ్ల సాధ్యాసాధ్యులపై అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే క్యాబినెట్లో చర్చించి పరిష్కరించడానికి కృషి చేస్తానని, ఆ విషయాలను మరొకసారి సమావేశమై మీకు వివరిస్తానని, ఇప్పటినుండి ప్రతినెల మీతో సమావేశమై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ వారికి హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి వానపల్లి ముత్యాల రావు, తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ గౌరవ అధ్యక్షులు పి నరేంద్ర, పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ తేజతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## మాస్కోపై ఉక్రెయిన్
# డ్రోన్ దాడులు

మాస్కో: రష్యా- ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘ యుద్ధం కొనసాగుతోంది. రష్యా రాజధాని మాస్కోను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ 17 డ్రోన్లను ప్రయోగించినట్లుగా రష్యా అధికారులు పేర్కొన్నారు. రామెన్‌స్కోయ్, కొలోమెన్‌స్కీ జిల్లాలతో పాటు మాస్కోకు నైరుతి దిశలో ఉన్న డొమోడెడోవో నగరంలో 12 డ్రోన్లను ధ్వంసం చేశామని మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. ఈ డ్రోన్ దాడుల కారణంగా మాస్కోలోని డొమోడెడోవో, జుకోవో విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ దాడుల కారణంగా ప్రాణ నష్టం జరగ లేదని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు.ంకాగా కొద్ది రోజులుగా రష్యా ఉక్రెయిన్‌పై క్షిపణి దాడులను కొనసాగిస్తూనే ఉంది. క్షిపణులు, డ్రోన్లు, బాంబులతో రష్యా దళాలు విరుచుకుపడుతున్నాయి. తాజా ఘటనల్లో ఒకరు మృతి చెందగా, 38 మంది గాయపడ్డారు. వీటికి ప్రతీకారంగా ఉక్రెయిన్ ఎదురు దాడులకు పాల్పడుతోంది.



## ప్రజా విజయోత్సవాలు కాదు..
# ప్రజా వంచన ఉత్సవాలు చేసుకోండి
### కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ సెటైర్లు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్**

ఏడాది పాలనపై కాంగ్రెస్ పార్టీ ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించడంపైనా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ బండి సంజయ్ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. ఏం సాధించారని ప్రజా విజయోత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలు చేశారని విజయో త్సవాలు చేసుకుంటున్నారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, మహిళలకు తులం బంగా రం, స్కూటీ, నెలనెలా రూ.2500 లు ఇచ్చారని విజయోత్సవాలు చేసుకుంటారా? వృద్ధులకు రూ.4 వేల ఆసరా పెన్షన్ ఇచ్చారని చేసుకుం టారా? పేదలకు ఇండ్లు ఇచ్చారని చేసుకుం టారా? దేనికోసం విజయోత్సవాలు అని కాంగ్రె స్ ప్రభుత్వాన్ని బండి సంజయ్ ప్రశ్నించారు. అవ న్నీ ఇచ్చాక ఉత్సవాలు చేసుకోవాలని హితవు పలి కారు. ఇప్పుడు మీరు చేసుకోవాల్సింది విజయోత్స వాలు కాదు నమ్మించి ప్రజలను మోసం చేసింది కు 'ప్రజా వంచన' ఉత్సవాలు చేసుకోండని ధ్వజ మెత్తారు.కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు వద్ద బీజేపీ నాయకులతో కలిసి కొనుగో లు కేంద్రాలను బండి సంజయ్ సందర్శించారు. వడ్ల కొనుగోలులో రైతులు పడుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బండి సంజ య్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ పైసలివ్వకుండా తప్పించుకోవడానికి వడ్ల కొనుగో లు చేయకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. బ్రోకర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకు రాష్ట్ర రైతుల ప్రయోజనాలను బలి పెడుతున్నారని ధ్వజ మెత్తారు. వడ్ల పైసలన్నీ మిత్తీతో సహా కేంద్రమే చెల్లిస్తోందని.. అయినప్పటికీ వడ్లు కొనివ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన నొప్పి ఏందని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు కనీస మద్దతు ధర



దక్కలేదని.. బోనస్ రాలేదని బండి సంజయ్ అన్నారు. పైగా తాలు, తరుగు, తేమ పేరుతో నష్టం జరిగిందన్నారు. ఇక మీరు రైతులను ఆదుకున్నదెక్కడ అని ప్రశ్నించారు. ఇదేనా రైతు ప్రభుత్వమంటే ఇదేనా ఇందిరమ్మ పాలన అని మండిపడ్డారు. రైతులను అరిగోసపెట్టి దోచుకోవడమేనా కాంగ్రెస్ పాలనంటే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 95 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండిస్తే బహిరంగ మార్కెట్ అవసరాలకు 40 లక్షల వడ్లు పోతే, మిగిలిన 55 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల కొనుగో లుకు సంబంధించి పైసలన్నీ చెల్లించేందుకు కూడా కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. చివరకు వడ్ల కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం బయట నుంచి అప్పు తీసుకుంటే ఆ డబ్బులకు వడ్డీ కూడా కేంద్రమే చెల్లిస్తోందని.. అయినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏం మాయరోగం అని నిలదీశారు. ఎందుకు సకాలంలో వడ్లు కొనకుండా రైతులను అరిగోస పెడుతోందని ప్రశ్నించారు.

సకాలంలో వడ్లు కొంటే బోనస్ ఇయ్యాలి. దానికి 2,500 కోట్లు కావాలి. ఇంతా చేస్తే మిగిలే దేమీ ఉండదు. అలా కాకుండా కొనుగోలు కేంద్రా లకు వచ్చిన వడ్లను బ్రోకర్లు కొనేదాకా ఎదురు చూస్తే కోట్లకు కోట్లు కమీషన్లు దండుకో వచ్చు బోనస్ భారం నుంచి తగ్గించుకోవచ్చు ఇదీ కాంగ్రె స్ కుట్ర అని బయటపెట్టారు. బోనస్ ఇవ్వకుండా తప్పించుకోవడానికి, కమీషన్లు దండు కోవడానికి రైతుల ప్రయోజనాలను బలి పెడుతు న్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు వడ్లన్నీ కొనాల్సిందేనని.. బోనస్ చెల్లించా ల్సిందేనని డిమాండ్ చేశారు.

# భాజపా ఉన్నంత వరకు
# మతపరమైన రిజర్వేషన్లు ఉండవు

రాంచీబీ పలామూ: దేశంలో భాజపా ఉనికిలో ఉన్నంత కాలం మతపరమైన రిజర్వేషన్లు ఉండవని ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఓబీసీలు, దళితులు, గిరిజ నుల రిజర్వేషన్ పరిమితిని తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ భావిస్తోందని ఆరోపించారు. భారత రాజ్యాం గంలో ఎక్కడా మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించే నిబంధ నలు లేవని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను ఓబీసీ వ్యతిరేక పార్టీగా అభివర్ణించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జార్ఖండ్‌లోని పలామూ, తూర్పు సింగ్భంలో పొట్కాలో శనివారం నిర్వహించిన ర్యాలీల్లో కాంగ్రెస్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు.

### రాహుల్ రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నకిలీ రాజ్యాంగ ప్రతిని చూపి స్తూ దాన్ని అపహాస్యం చేశారని అమిత్ షా దుయ్యబట్టారు. "రాహుల్ గాంధీ ఓ ఎన్నికల ర్యాలీలో రెండు రోజుల క్రితం రాజ్యాంగం కాపీని



చూపించారు. అది నకిలీది. అందులో ఎలాం టి కంటెంట్ లేదు. కాపీ కవర్‌పై మాత్రమే భారత రాజ్యాంగం అని రాసి ఉంది. రాహుల్ రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. నకిలీ రాజ్యాంగ ప్రతి చూపి రాహుల్ బీఆర్ అంబేడ్కర్, రాజ్యాం గ పరిషత్‌ను అవమానించారు. మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ఏటా నవంబరు 26వ తేదీని రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకొంటోంది.జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. గాంధీల నాలుగో తరం వచ్చి అడిగినా ఆర్టికల్ 370ని పునరుద్ధ రించే అవకాశం లేదు" అని అమిత్ షా వ్యాఖ్యానించారు.





డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్ ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. డ్రగ్స్ ను అరికట్టి, తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# కబ్జా చేసిన వారిని వదిలిపెట్టం..
### మంత్రి పొంగులేటి మాస్ వార్నింగ్

**ప్రజాభూమి ప్రతినిధి, వరంగల్:**

వరంగల్‌ను తెలంగాణకు రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. దశాబ్దాల కాలంగా సమస్యల్లో ఉన్న మామునూర్ ఎయిర్ పోర్ట్‌కు అవాంతరాలు తొలగిపోయాయని చెప్పారు. ఇవాళ(ఆదివారం) వరంగల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వస్తుందని స్పష్టం చేశారు. భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి



చేస్తామని అన్నారు. మాడ వీధులను త్వరితగతిన పూర్తి చేస్తామని మాటిచ్చారు. భద్రకాళి జలాశయాన్ని తాగునీటి జలాశయంగా మారుస్తామని హామీ ఇచ్చారు. భద్రకాళి చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చెరువుపై సర్వే చేయించి నిర్మాణాలను తొలగిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.




# పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

వాణిజ్య సంబంధాలు మరింత బలపడాలని తాము కోరుకుంటున్నట్టు ఆయన వివరించారు. రెండు దేశాల సంస్కృతుల్లో అనేక సారూప్యతలు ఉన్నందున పరస్పర సహకారం మరింత తేలిక అవుతుందని శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. పెట్టుబడులతో తమ దేశానికి వచ్చే వారందరికి హైదరాబాద్ ఎంట్రీ పాయింట్ గా ఆహ్వానం పలుకుతోందని ఆయన వెల్లడించారు. డిసెంబరులోగా తెలంగాణా సందర్శించేందుకు తాము ఏర్పాట్లు చేస్తున్నామని మలేషియా పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం పలికారు.

### రాజకీయ ప్రస్థానానికి 25 ఏళ్లు

అనూహ్య పరిస్థితుల్లో ప్రజాసేవలోకి వచ్చిన తాను ప్రజా ప్రతినిధిగా నవంబరు పదితో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విషయం ఇక్కడి మిత్రులు తనకు చెప్పేవరకూ గుర్తు లేదని అన్నారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపిన వారందరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు వెల్లడించారు. రెండున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో పార్టీలో ఎంతో ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహిస్తూ వచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. మంత్రిగా తాను పనిచేసిన నలుగురు ముఖ్యమంత్రులు తన పట్ల ఎంతో ఆదరాభిమానాలు కనబర్చారని తెలిపారు. ఇన్నేళ్లుగా తనను ఆదరిస్తున్న సహచరులకు, తన వెంట నిలిచిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణ బియ్యాన్ని దిగుమతి
# మేము చేసుకుంటాం
### మలేసియన్ బిజినెస్ మీట్‌లో
### మలేషియన్ దిగుమతి దారుల హామీ

తెలంగాణ లో పండుతున్న వ్యవసాయ అభివృద్ధి గురించి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. మలేసియా బిజినెస్ మీట్ లో తెలంగాణ లో సాగు చేస్తున్న వరి, ధాన్యం రకాల గురించి, నాణ్యత, తదితర అంశాలను మలేషియన్ బిజినెస్ మీట్ లో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సులర్ అల్దాస్ జానయ్య వివరించారు. తెలంగాణ బియ్యాన్ని తాము దిగుబడి చేసుకుంటామని హామీ ఇచ్చిన బియ్యం దిగుమతి దారులు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ కుమార్, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పాల్గొన్నారు.

# కెనడాలో బ్యాంక్ సేవలపై ఎస్‌బీఐ ప్రకటన




భారత్, కెనడా మధ్య గత కొంత కాలంగా దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే ఇటీవల ఆ దేశంలోని హిందువుల మీద, హిందూ దేవాలయాల మీద దాడులు జరిగాయి. దీంతో హిందువులు పెద్ద ఎత్తున కెనడా రోడ్ల మీదకు వచ్చి నిరసన కార్యక్రమాలను చేపట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తమైంది. ఈ తరుణంలో 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అక్కడ బ్యాంకింగ్ సేవలకు సంబంధించి కీలక ప్రకటన చేసింది.

కెనడాలో జరుగుతున్న ఉద్రిక్తతలు బ్యాంక్ సేవల మీద ఎలాంటి ప్రభావాన్ని చూపలేదు. కాబట్టి సంస్థ తన కార్యకలాపాలను ఎప్పటిలాగే నిర్వర్తిస్తుందని ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడించారు. అంతే కాకుండా రెగ్యులేటరీ రెగ్యులేటర్‌లు లేదా కస్టమర్‌ల విధానంలో మేము ఎలాంటి మార్పును చూడలేదని పేర్కొన్నారు.

ఎస్‌బీఐ.. కెనడాలో టొరంటో, బ్రాంప్టన్, వాంకోవర్‌లతో సహా పూర్తిగా యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ద్వారా ఎనిమిది శాఖలను నిర్వహిస్తోంది. ఎస్‌బీఐను కూడా మేము అక్కడి స్థానిక బ్యాంకులలో ఒకటిగా భావిస్తున్నామని సీఎస్ శెట్టి అన్నారు. 1982 నుంచి ఎస్‌బీఐ కెనడాలో తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది.



# మొబైల్ యూజర్లకు ట్రాయ్ హెచ్చరిక

సైబర్ క్రైమ్స్ ప్రస్తుతం భారతదేశంలో ఒక పెద్ద సమస్యగా మారిపోతోంది. ఎప్పటికప్పుడు స్కామర్లు కొత్త అవతారాలెత్తి ప్రజలను మోసం చేస్తున్నారు, డబ్బు దోచేస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో మొబైల్ యూజర్లకు చాలా జాగ్రత్తగా ఉండాలని 'టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా' హెచ్చరికలు జారీ చేసింది.



స్కామర్లు బాధితులను మోసం చేయడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఎలక్ట్రిక్ కనెక్షన్ లేదా ఇంటర్నెట్ కనెక్షన్ వంటి సదుపాయాలను నిలిపేస్తామని బెదిరిస్తారు. బాధితుడు చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని నేరగాళ్లు తప్పుగా పేర్కొంటారు. దీంతో కొందరు భయపడి నేరగాళ్లు చెప్పినట్లు వింటారు, భారీగా డబ్బు కోల్పోతారు. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా.. షేర్ చేసిన ఒక వీడియోలో ఇలాంటి స్కామ్‌కు సంబంధించిన సంఘటనను చూడవచ్చు. కాబట్టి ప్రతి ఒక్క మొబైల్ యూజర్ తెలియని నంబర్స్ నుంచి వచ్చే కాల్స్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని.. సంచార్ సాథీ పోర్టల్‌ని ఉపయోగించి ఏవైనా అనుమానాస్పద కాల్‌లను నివేదించాలని ట్రాయ్ కోరింది.

### పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్

ప్రభుత్వ డేటా ప్రకారం.. 2024 జనవరి నుంచి ఏప్రిల్ వరకు డిజిటల్ అరెస్ట్ స్కామ్ కారణంగా బాధితులు సుమారు రూ. 120.3 కోట్లు నష్టపోయినట్లు తెలిసింది. అక్టోబర్ 27న మన్ కీ బాత్ 115వ ఎపిసోడ్ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ సమాచారాన్ని అందించారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ 2024 మొదటి త్రైమాసికంలో దాదాపు 7.4 లక్షల సైబర్ క్రైమ్ ఫిర్యాదులు అందుకున్నట్లు వెల్లడించింది.

డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు లేదా సైబర్ నేరగాళ్లు బాధితురాలకు ఫోన్ చేసి అక్రమ వస్తువులు లేదా నిషిద్ధ వస్తువులకు సంబంధించిన నేరంలో మీ ప్రమేయం ఉందని భయపెడతారు. టెక్నాలజీలను ఉపయోగించి వీడియో కాల్స్ ద్వారా నకిలీ కోర్టులను, న్యాయమూర్తులను ఏర్పటు చేస్తారు. అరెస్టు లేదా చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఉండటానికి డబ్బు చెల్లించాలని.. భారీ మొత్తంలో మోసం చేస్తుంటారు. కాబట్టి ఇలా మోసం చేసేవారు మీకు ఎప్పుడైనా ఫోన్ చేసి బెదిరిస్తే.. తప్పకుండా సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

# మాస్క్‌డ్ ఆధార్ కార్డు

టెక్నాలజీ పెరుగుతున్న తరుణంలో కొంతమంది.. ఇతరుల ఆధార్ కార్డు నెంబర్‌ను కొన్ని అనధికార కార్యకలాపాలకు వినియోగిస్తారు. అసలు ఆ వ్యక్తికే తెలియకుండా ఈ చర్య జరిగిపోతుంది. కాబట్టి మన ఆధార్ కార్డు నెంబర్ సురక్షితంగా ఉండాలంటే.. మాస్క్‌డ్ ఆధార్ కార్డును ఉపయోగించుకోవచ్చు. ఇంతకీ మాస్క్‌డ్ ఆధార్ కార్డ్ అంటే ఏమిటి? దీనిని ఎక్కడ, ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.




ఆధార్ కార్డు దుర్వినియోగానికి చరమగీతం పాడటానికి కేంద్రం ఈ మాస్క్‌డ్ ఆధార్ కార్డును తీసుకువచ్చింది. ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాల్సిన అవసరం లేని.. లేదా ఈకేవైసీ మాత్రమే ఇవ్వాల్సిన చోట మాస్క్‌డ్ ఆధార్ కార్డును ఉపయోగించుకోవచ్చు. ఎందుకంటే ఈ తరహా ఆధార్ కార్డులో కేవలం చివరి నాలుగు నెంబర్లు మాత్రమే కనిపిస్తాయి.

### మాస్క్‌డ్ ఆధార్ కార్డు

సాధారణ ఆధార్ కార్డులో 12 అంకెలు ఉంటాయని అందరికి తెలుసు. కానీ మాస్క్‌డ్ ఆధార్ కార్డులో కేవలం చివరి నాలుగు అంకెలు మాత్రమే ఉంటాయి. ఎందుకంటే ముందు ఉన్న ఎనిమిది అంకెలకు మాస్క్ ఉంటుంది. అంటే.. ఆ ఎనిమిది నెంబర్లు కనిపించవన్నమాట. దీనిని ఉపయోగించడం వల్ల ఇతరులు మీ ఆధార్ నెంబర్‌ను దుర్వినియోగం చేయడానికి అవకాశం లేదు.

### మాస్క్‌డ్ ఆధార్‌ని డౌన్‌లోడ్ చేయడం ఎలా?

- మాస్క్‌డ్ ఆధార్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలనుకునేవారు ముందుగా అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి.
- వెబ్‌సైట్ ఓపెన్ చేసిన తరువాత డౌన్‌లోడ్ ఆధార్ అనే ఆప్షన్ కనిపిస్తుంది, దానిపైన క్లిక్ చేయాలి.
- తరువాత 12 ఆధార్ నెంబర్ ఎంటర్ చేయాలి, దాని కింద క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి.
- ఆలా చేసిన తరువాత రిజిస్ట్రేషన్ మొబైల్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసి అక్కడ మాస్క్‌డ్ ఆధార్ కావాలా? అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాల్సి ఉంటుంది.
- ఆలా చేసిన తరువాత మీకు మాస్క్‌డ్ ఆధార్ కార్డు పీడీఎఫ్ రూపంలో డౌన్‌లోడ్ అవుతుంది. దీనిని పాస్‌వర్డ్ ఉపయోగించి ఓపెన్ చేసుకోవాల్సి ఉంటుంది


# ఏ హామీ లేకుండానే లోన్

## నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) తయారీ సామర్థ్యాలను పెంపొందించేందుకు కొలేటరల్-ఫ్రీ టర్మ్ లోన్ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ పథకాన్ని త్వరలోనే కేబినెట్ ముందు ఉంచుతామని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బెంగళూరులో జరిగిన నేషనల్ ఎంఎస్ఎంఈ క్లస్టర్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఈ కొలేటరల్-ఫ్రీ టర్మ్ లోన్ స్కీమ్ గురించి వెల్లడించారు. ఈ కొత్త పథకం ద్వారా కేంద్రం ఎంఎస్ఎంఈలకు ఏకంగా రూ. 100 కోట్ల వరకు రుణాలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



నిర్మలా సీతారామన్ వెల్లడించిన ఈ పథకానికి కేంద్ర మంత్రి మండలి అనుమతి దక్కితే ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ.. బ్యాంకుల ద్వారా లోన్ అందిస్తుంది. కేంద్రం అందించే ఈ లోనుకు ఎలాంటి హామీ అవసరం లేదని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈలు బ్యాంకుల నుంచి వర్కింగ్ క్యాపిటల్‌ను పొందవచ్చు. కానీ వారికి టర్మ్ లోన్‌లు, ప్లాంట్.. మెషినరీ కోసం లోన్ లభించడం లేదని ఈ సందర్భంగా సీతారామన్ పేర్కొన్నారు. అయితే ఇప్పుడు ప్రవేశపెట్టనున్న కొత్త పథకం ద్వారా.. ప్లాంట్స్, యంత్రాలకు కూడా లోన్స్ అందించనున్నట్లు వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగంలో కర్ణాటక చేస్తున్న కృషిని సీరాటమన్ ప్రశంసిస్తూ.. రాష్ట్రంలో 35 లక్షల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని, అవి 1.65 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తున్నాయని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఈ రంగం మరింత వృద్ధి చెందుతుందని, ప్రభుత్వం కూడా దీనికి సహకరిస్తుందని ఆమె అన్నారు



# చెత్త సంపాదన రూ.2,364 కోట్లు

కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛత' ప్రచారాల ద్వారా స్క్రాప్‌ల (చెత్త) తొలగింపుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే కేవలం మూడేళ్ళలో ప్రభుత్వం ఏకంగా 2,364 కోట్ల రూపాయలను ఆర్జించింది. ఈ విషయాన్ని కేంద్ర సహాయ మంత్రి 'జితేంద్ర సింగ్' సోషల్ మీడియాలో వెల్లడించారు.స్క్రాప్‌ల ద్వారా భారీ మొత్తాన్ని ప్రభుత్వానికి చేకూర్చడానికి సహకరించిన 'డిపార్ట్మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్' ను భారత ప్రధాని 'మోదీ' ప్రశంసించారు. జితేంద్ర సింగ్ పోస్ట్‌ను షేర్ చేస్తూ.. ప్రశంసనీయం! సమర్థవంతమైన నిర్వహణ, చురుకైన చర్యపై దృష్టి సారించడం ద్వారా గొప్ప ఫలితాలను సాధించారు. పరిశుభ్రత, ఆర్థిక వివేకం రెండింటినీ ప్రోత్సహిస్తూ.. సమిష్టి ప్రయత్నాలు స్థిరమైన ఫలితాలకు ఎలా దారితీస్తాయో ఇది చూపిస్తుందని మోదీ పేర్కొన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఫిజికల్ ఫైళ్లను తొలగించడం వల్ల 15,847 అడుగుల స్థలం ఖాళీ అయింది. దీని ద్వారా సుమారు రూ. 16,39,452 ఆదాయం లభించింద వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# లాంచ్‌కు సిద్ధమవుతున్న 'మిఫా 9'

భారతదేశంలో అతి తక్కువ కాలంలో అధిక ప్రజాదరణ పొందిన కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్ వచ్చే ఏడాది దేశీయ మార్కెట్లో 'మిఫా 9' (%వీఱటఖ% 9) ఎంపీవీ లాంచ్ చేయడానికి సిద్ధమవుతోంది. కాగా ఈ కారు విక్రయాలు 2025 మార్చిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అంతకంటే ముందు 2025 జనవరిలో జరిగే భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో ప్రదర్శనకు రానున్నట్లు సమాచారం.

ఎంజీ మిఫా 9 కారు 2023లోనే మొదటిసారి ఆటో ఎక్స్‌పోలోలో కనిపించింది. ఇది మార్కెట్లో లాంచ్ అయిన తరువాత కీయ కార్నివాల్‌కు ప్రత్యర్థిగా ఉండనుంది. ఈ కారు ఒట్టోమన్ సీట్లతో 7 సీటర్, 8 సీటర్ కాన్ఫిగరేషన్‌లలో లాంచ్ అవుతుందని తెలుస్తోంది.

స్ప్లిట్ హెడ్‌ల్యాంప్ సెటప్, ఫ్రంట్ ఫాసియా అంతటా విస్తరించి ఉండే ఎల్ఈడీ డేటైమ్ రన్నింగ్ లైట్ ఉంటుంది. వెనుకవైపు ఎంపివి మధ్యలో లైట్ బార్‌తో వీ షేప్ ఎల్ఈడీ టైల్‌లైట్ సెటప్ ఉంటుంది. ఇది పవర్ స్లైడింగ్ రియర్ డోర్స్ పొందనున్నట్లు సమాచారం. ఈ కారు 2.0 లీటర్ పెట్రోల్, డీజిల్ మైల్డ్ హైబ్రిడ్ ఇంజిన్ ఆప్షన్స్ పొందుతుందని సమాచారం. కాగా కంపెనీ ఈ కారుకు సంబంధించిన చాలా విషయాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.





# ఫుల్ ఖుషీగా కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం 'క' మూవీతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. సుజిత్- సందీప్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించింది. తన్వీరామ్, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా థియేటర్లలో సందడి చేసింది. లక్కీ భాస్కర్, అమరన్ చిత్రాలతో పోటీపడి బాక్సాఫీస్ వద్ద హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా మెగాస్టార్ చిరంజీవి 'క' మూవీ టీమ్‌ను అభినందించారు. వారితో దాదాపు గంటకుపైగా మాట్లాడారు. ఈ విషయాన్ని కిరణ్ అబ్బవరం తన ట్విటర్ ద్వారా పంచుకున్నారు. చిరంజీవితో ఉన్న ఫోటోలు షేర్ చేస్తూ ధన్యవాదాలు తెలిపారు. మిమ్మల్ని కలిసిన ప్రతిసారీ నాకెంతో ప్రత్యేకమైన ఫీలింగ్ ఉంటుందని కిరణ్ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి

# జ్యోతిక నాకంటే ఎక్కువ పారితోషికం

తన సతీమణి జ్యోతిక పై ఉన్న ఇష్టాన్ని ఇటీవల వరుస ఇంటర్వ్యూల్లో తెలియజేస్తున్నారు నటుడు సూర్య . తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మరోసారి ఆమెపై ప్రేమను వ్యక్తపరిచారు. 'కంగువా' ప్రమోషన్స్‌లో భాగంగా తన సతీమణి జ్యోతిక పై ఉన్న ఇష్టాన్ని తెలియజేస్తున్నారు నటుడు సూర్య . ఆమెతో ప్రేమ, పెళ్లి.. ఇటీవల ముంబయికు షిఫ్ట్ కావడం వంటి విషయాల గురించి ఇప్పటికే ఆయన మాట్లాడిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి తన సతీమణి గురించి సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె తన కోసం ఎంతో చేసిందన్నారు. అన్ని వేళలా అండగా నిలబడిందన్నారు. ఇప్పుడు ఆమెకు సపోర్ట్ చేయాల్సిన బాధ్యత తనకు ఉందన్నారు.



"డోలీ సజా కే రఖ్నా' అనే బాలీవుడ్ మూవీతో జ్యోతిక ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆమె నటించిన రెండో చిత్రం నాతోనే. 'పూవెల్లం కెట్టుప్పర్' అనేది టైటిల్. అది నా ఐదో చిత్రం అయినప్పటికీ నేనెంతో భయపడేవాడిని. డైలాగ్స్ మర్చిపోయేవాడిని. మధ్య మధ్యలో తడబడేవాడిని. తను అలా కాదు. తమిళంలో తొలి చిత్రమే అయినా డైలాగ్స్ చాలా స్పష్టంగా చెప్పేది. వర్క్‌పై ఎంతో శ్రద్ధ చూపించేది. అది నాకెంతో నచ్చింది. ఆ సినిమా తర్వాత మేమిద్దరం మంచి స్నేహితులయ్యాం. ఒకరిపై ఒకరికి గౌరవం ఏర్పడింది. కెరీర్ ఆరంభంలోనే తను సక్సెస్ అందుకుంది. తొలి సక్సెస్ రుచి చూడటానికి నాకు ఐదేళ్లు పట్టింది. 'కాక్క కాక్క' మూవీ కోసం మే మిద్దరం కలిసి వర్క్ చేశాం. ఆ చిత్రానికి నా కంటే మూడు రెట్లు ఎక్కువ రెమ్యునిరేషన్ తను అందుకుంది. కెరీర్ పరంగా అప్పుడు నేను ఎక్కడ ఉన్నానో తెలిసినప్పటికీ తను నాతో జీవితాన్ని పంచు కోవడానికి సిద్ధపడింది" అని సూర్య తెలిపారు. దాదాపు 27 ఏ ళ్లు జ్యోతిక చెన్నైలో ఉన్నారని.. ఇప్పుడు ఆమె తల్లిదండ్రులకు తమ అవసరం ఉండటం వల్ల ముంబయి షిఫ్ట్ అయ్యామని అన్నారు.




# తుదిదశలో ఎంపురాన్

మోహన్‌లాల్ హీరోగా నటించిన మలయాళ బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'లూసిఫర్' (2019). ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు ఓ చిన్న రోల్‌లో నటించారు పృథ్వీరాజ్ సుకుమారన్. కాగా 'లూసిఫర్' సినిమాకు సీక్వెల్‌గా 'ఎల్2: ఎంపురాన్' సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీలో కూడా మోహన్‌లాల్ హీరోగా నటిస్తుండగా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఓ పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా మేజర్ పార్ట్ చిత్రీకరణ పూర్తయింది. తాజాగా 'ఎల్ 2 :ఎంపురాన్' సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుందని, ఫైనల్ షెడ్యూల్ మొదలైందని పృథ్వీరాజ్ 'ఎక్స్'లో షేర్ చేశారు. ప్యాచ్ వర్క్‌తో సహా డిసెంబరులోపే మొత్తం చిత్రీకరణను పూర్తి చేయాలన్నది పృథ్వీరాజ్ టార్గెట్ అని మాలీవుడ్ సమాచారం. లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ సినిమాస్ నిర్మిస్తున్న 'ఎల్2: ఎంపురాన్' సినిమా 2025 మార్చి 25న తెలుగు, తమిళం, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ కానుంది.

# సోనూసూద్‌కు అరుదైన గౌరవం



బాలీవుడ్ నుంచి తెలుగులో ఎంట్రీ ఇచ్చిన స్టార్ నటుడు సోనూసూద్.. తెలుగు సినిమాల్లో విలన్ పాత్రలు వేసినప్పటికీ రియల్ లైఫ్‌లో హీరోగా పేరు తెచ్చుకున్నారు. ఇప్పటికే నెటజన్ల నుంచి ఎన్నో ప్రశంసలు అందుకున్న ఆయనకు తాజాగా థాయిలాండ్ ప్రభుత్వం అరుదైన గౌరవాన్ని కల్పించింది. దీంతో సోనూసూద్ అభిమానులు సోషల్‌మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. థాయ్‌ల్యాండ్ పేరు వింటే.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికి గుర్తుకొచ్చేది టూరిజం. సీజన్ ఏదైనా కానివ్వండి ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రదేశాల నుంచి పర్యాటకులు అక్కడికి వెళ్తూ ఉంటారు. ఈ క్రమంలో భారత్ నుంచి కూడా చాలామంది థాయిలాండ్‌కు వెల్లడం మనం చూస్తూనే ఉన్నాం. ఇప్పుడు థాయిలాండ్ ప్రభుత్వం సోనూసూద్‌కు అరుదైన గౌరవాన్ని కల్పించింది. తమ దేశ టూరిజం బ్రాండ్ అంబాసిడర్‌గా ఆయన్ను నియమించింది. ఇదే సమయంలో ఆయనను టూరిజం అడ్వైజర్‌గాను ఆ దేశం ఎంపిక చేసింది.



# అలాంటి పాత్రలు చేయను

"ప్రస్తుత సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తున్నా. అందుకే సినిమాల్లో రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలు నేను చేయను" అంటున్నారు హీరోయిన్ సమంత. వరుణ్ ధావన్, సమంత ప్రధాన పాత్రల్లో రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ'. అమేజాన్ ప్రైమ్‌లో ఈ సిరీస్ ఈ నెల 7 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.

ప్రియాంకా చోప్రా నటించిన హాలీవుడ్ సిరీస్ 'సిటాడెల్'కు ఇది ఇండియన్స్ వెర్షన్స్ . ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమంత 'సిటాడెల్: హనీ బన్నీ' సక్సెస్ పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఇదే వేదికపై సినిమాల్లో మహిళల పాత్రల గురించి ఆమె మాట్లాడుతూ–"ప్రేక్షకులను తక్కువ అంచనా వేయకూడదు. వారు అన్ని విషయాలను గమనిస్తారు. అందుకే ఏం చేసినా బాధ్యతగా చేయాలి. నేను ఒక విషయానికి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు దానికి సంబంధించిన పూర్తి బాధ్యత నాపై ఉంటుంది. అందుకే ఎన్నో విషయాల గురించి ఆలోచించి, పాత్రలను ఎంచుకుంటాను. ప్రస్తుతం సమాజంలో మహిళలకు న్యాయమైన ప్రాతినిధ్యం ఉండాలని భావిస్తున్నా.

సినిమాల్లో కూడా రెండు, మూడు సన్నివేశాలకే పరిమితమయ్యే పాత్రలకు నేను దూరంగా ఉంటాను. అలాగే నేను చేసే ప్రకటనల విషయంలోనూ ఆలోచిస్తాను. 'సిటాడెల్: హనీ బన్నీ'లో నటించడం నాకు సవాల్‌గా అనిపించింది. హీరోకు సమానమైన పాత్ర నాది. యాక్షన్స్ సన్నివేశాల్లోనూ హీరోతో సమానంగా చేశా. కానీ, ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయి. ఇలాంటి చాన్స్‌ల కోసం నటీమణులు చాలామంది ఎదురు చూస్తున్నారు. కానీ, నాకు ఇలాంటి అవకాశాలు ఎన్నో వచ్చినా అందులో కూడా కొన్నింటినే ఎంచుకుంటున్నాను. నాకు వచ్చిన ఆఫర్లకు, నేను చేసిన సినిమాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది" అని సమంత పేర్కొన్నారు.

# 'పుష్ప 2' శ్రీలీల కిస్సిక్

'పుష్ప ది రూల్' టీమ్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. కథానాయిక శ్రీలీల ఇందులో భాగమైనట్లు అధికారికంగా ప్రకటించింది. ఇందులో ఆమె స్పెషల్ సాంగ్ చేయనున్నట్లు తెలిపింది. 'కిస్సిక్' అంటూ సాగే ఈ పాట సాంగ్ ఆఫ్ ది ఇయర్ కానుందని పేర్కొంది. సినీ ప్రియులను ఇది తప్పక అలరిస్తుందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తమ టీమ్‌లోకి ఆమెను స్వాగతిస్తూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్ షేర్ చేసింది. 'ది డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల' అని పేర్కొంది. ప్రస్తుతం ఈ పాట చిత్రీకరణ జరుగుతోంది. దర్శకుడు సుకుమార్ సినిమాలో ఐటం సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటుంది. 'జగడం' మొదలు కొని.. 'పుష్ప ది రైజ్' వరకూ ఆయన తెరకెక్కించిన చాలా చిత్రాల్లో ఒక స్పెషల్ సాంగ్ ఉంది. 'పుష్ప ది రైజ్'లోని 'ఊ అంటావా'కు అంతటా ఆదరణ లభించింది. సమంత డ్యాన్స్‌కు సినీ ప్రియులు ఫిదా అయ్యారు. ఆ పాటకు వచ్చిన స్పందనను దృష్టిలో ఉంచుకుని 'పుష్ప ది రూల్'లోనూ అలాంటి సాంగ్ క్రియేట్ చేయాలని సుకుమార్ భావించినట్లు తెలుస్తోంది. ఇందులో ఎవరు భాగం కానున్నారనే దానిపై పలువురు హీరోయిన్స్ పేర్లు తెరపైకి రాగా.. చివరకు ఆ అవకాశాన్ని శ్రీలీల దక్కించుకున్నారు. 'ధమాకా'తో డ్యాన్స్‌లో తన టాలెంట్‌ని బయటపెట్టారామె. ఈ నేపథ్యంలోనే డ్యాన్స్‌లో ఐకాన్‌గా పిలవబడే అల్లు అర్జున్ సరసన ఆమె భాగం కావడంతో ఈ పాటపై అప్పుడే అంచనాలు ఏర్పడ్డాయి. థియేటర్లు ఈసారి దద్దరిల్లిపోతాయని పలువురు అనుకుంటున్నారు. వీరిద్దరూ గతంలో ఓ యాడ్ కోసం వర్క్ చేశారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో సుకుమార్ తెరకెక్కించిన చిత్రం 'పుష్ప' . అల్లు అర్జున్ ఊరమాస్ రోల్ పోషించిన ఈ సినిమా 2021లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' సిద్ధమవుతోంది.



# ఇలా ఎవరూ చేసి ఉండరు



అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యతగా వ్యవహరిస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోలో నటుడు విక్రాంత్ మస్సే, ఐపీఎస్ అధికారి మనోజ్ కుమార్ శర్మ పాల్గొని పలు విశేషాలు పంచుకున్నారు. ఐపీఎస్ అధికారి మనోజ్ కుమార్ శర్మ జీవితాధారంగా తెరకెక్కిన సినిమా '12ఫెయిల్' . విక్రాంత్ మస్సే ప్రధాన పాత్ర పోషించిన ఈ సినిమా ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచింది. అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యతగా వ్యవహరిస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' తాజా ఎపిసోడ్‌కు విక్రాంత్, మనోజ్ కుమార్‌లు హాజరై, పలు విశేషాలు పంచుకున్నారు. హాట్‌సీట్‌లో కూర్చొని.. సీషెల్స్ అధ్యక్షుడు ఎవరనే ప్రశ్నకు ఆడియన్స్ పోల్ ద్వారా సరైన సమాధానం చెప్పి రూ. 1,60,000 గెలుచుకున్నారు. ఆ కార్యక్రమం గురించి మనోజ్ కుమార్ మాట్లాడుతూ నాటి రోజులు గుర్తు చేసుకున్నారు. "యూపీఎస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సమయంలో.. నా ప్రిపరేషన్‌కు ఏమైనా దోహదం చేస్తుందేమోనని దగ్గరలోని దుకాణాల్లో ఈ షో చూసేవాడిని. ఇండియన్ పోలీస్ సర్వీస్‌లో జాయిన్ అయ్యేందుకు ఆ అనుభవం నాకు పునాదిలాంటిది" అని పేర్కొన్నారు. ఎంతోకాలంగా ఇండస్ట్రీలో ఉన్న విక్రాంత్.. అమితాబ్‌ను తొలిసారి మీట్ అవడంపై ఆనందం వ్యక్తం చేశారు. దానిపై అమితాబ్ స్పందిస్తూ.. 'నాకు మాత్రం మనం ఇప్పటికే చాలా సార్లు కలుసుకున్నట్టు అనిపిస్తోంది. తెరపై మీ నటన చూసినప్పుడల్లా మా కుటుంబ సభ్యుడు అనిపిస్తుంది' అని అన్నారు.





# శ్రీకాంత్, శ్రావ్య ఒక్కటయ్యారు

భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ ఓ ఇంటివాడయ్యాడు. ఫ్యాషన్ డిజైనర్ శ్రావ్య వర్మను అతను శనివారం పెళ్లాడాడు. హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, సినీ-క్రీడా ప్రముఖుల నడుమ వీరి వివాహం వైభవంగా జరిగింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ రజతం గెలవడంతో పాటు ఎన్నో గొప్ప విజయాలు సాధించిన శ్రీకాంత్ 2018లో ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారుడిగా నిలిచాడు. శ్రావ్య పలువురు సినీ ప్రముఖులకు వ్యక్తిగత స్టైలిస్ట్‌గా పని చేయడంతో పాటు 'గుడ్ లక్ సఖి' చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించింది.

# మెగా వేలంలో రిషభ్ పంత్

### తుది నిర్ణయం ఆ ముగ్గురిదే: సీఎస్కే సీఈవో

ఐపీఎల్ మెగా వేలం నవంబర్ 24, 25 తేదీల్లో సౌదీ అరేబియా వేదికగా జరగనుంది. ఇప్పటికే చాలా మంది క్రికెటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఐపీఎల్ వేలంలో అందరి దృష్టి రిషభ్ పంత్‌పైనే ఉంది. అత్యధిక ధర అతడికే దక్కుతుందని ఊహాగానాలు వస్తున్నాయి. పంజాబ్, సీఎస్కే, ఆర్సీబీ జట్లు అతడిని తీసుకోవడానికి భారీ మొత్తం వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలుస్తోంది. దిల్లీ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన పంత్‌ను ఆ జట్టు ఇటీవల రిటైన్ చేసుకోలేదు. దీంతో మెగా వేలంలో తన పేరును నమోదు చేసుకున్నాడు. ఇటీవల టీ20 ప్రపంచ కప్‌లో అద్భుత ఆటతీరు ప్రదర్శించిన అతడు.. టెస్టు సిరీసుల్లోనూ మెరుగ్గా రాణించాడు. ఈ క్రమంలో పంత్‌ను సీఎస్కే తీసుకుంటుందనే వార్తలపై ఆ ఫ్రాంచైజీ సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందించారు. మాజీ క్రికెటర్ అంబటి రాయుడుతో జరిగిన సంభాషణలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



"రిషభ్ పంత్ అద్భుతమైన ఆటగాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. ఈసారి మెగా వేలంలోకి వచ్చాడు. మా ఫ్రాంచైజీ అతడిని తీసుకుంటుందా? లేదా? అనేది ఇప్పుడే చెప్పలేను. ఈ విషయాన్ని కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తోపాటు ధోనీ , కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో కూడా చర్చించాం. పంత్‌ను తీసుకోవాలంటే వీరే తుది నిర్ణయం తీసుకోవాలి. గత కొన్నేళ్లుగా సీఎస్కే నిలకడైన ఆటతీరు ప్రదర్శించడానికి ప్రధాన కారణం జట్టులోని సభ్యులే. వచ్చే ఏడాది కూడా అత్యుత్తమ టీమ్‌తోనే బరిలోకి దిగుతాం.

ఇప్పటికే రిటెన్షన్‌పై సులువుగానే నిర్ణయం తీసుకున్నాం. రుతురాజ్, జడేజా, ధోనీ, దూబె, మతీశా పతిరన.. మా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. మిగిలిన ఆటగాళ్లు కూడా బాగా రాణించారు. వారిలో కొందరినైనా మళ్లీ దక్కించుకుంటాం. టాప్ క్రికెటర్లను రిటైన్ చేసుకోవడం వల్ల మా పర్సులో ఎక్కువ మొత్తం లేదని తెలుసు. మిగిలిన క్రికెటర్లతో టీమ్‌ను ఏర్పాటు చేసేందుకు ఉన్న సొమ్మునే వినియోగించాల్సి ఉంది. భారత్‌లోని అత్యుత్తమ ప్లేయర్లను తీసుకుంటాం. వేలం కాబట్టి వారిని దక్కించుకుంటామో లేదో ఇప్పుడే చెప్పలేం" అని విశ్వనాథన్ వెల్లడించారు.



### స్వల్ప లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా..

# పోరాడి ఓడిన భారత్

భారత్‌తో జరుగుతున్న నాలుగు టీ20ల సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 3 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులకు పరిమితమైంది. హార్దిక్ పాండ్య (39: 45 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) రాణించాడు. స్వల్ప లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చెమటోడ్చి నెగ్గింది. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఆ జట్టు 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆ జట్టులో స్టబ్స్ (47ని) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి అద్భుతంగా చెలరేగాడు. 4 ఓవర్లలో కేవలం 17 పరుగులే ఇచ్చి 5 వికెట్లు తీశాడు. అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో రెండు జట్లు 1-1తో సమమయ్యాయి.

**హార్దిక్ ఒక్కడే..**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా ప్రారంభంలోనే పీకల్లోతు కష్టాల్లోకి జారుకుంది. గత మ్యాచ్ హీరో సంజూ శాంసన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అభిషేక్ శర్మ (4), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (4) మరోమారు విఫలం కావడంతో భారత్ 15 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో తిలక్ వర్మ (20), అక్షర్ పటేల్ (27)లు జాగ్రత్తగా ఇన్నింగ్స్‌ను నిర్మించినా.. కీలక సమయంలో వీరిద్దరూ ఔటయ్యారు. ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హార్దిక్ పాండ్య క్రీజులో నిలుదొక్కుకోవడంతో భారత్ ఆమాత్రం స్కోరైనా చేసింది. రింకు సింగ్ (9) మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. దీంతో భారత్ 124 పరుగులకే పరిమితం అయింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్‌సెన్, కొయెట్జీ, సైమ్‌లేన్, మార్‌క్రమ్, పీటర్ తలో వికెట్ తీశారు.



**ఆదుకున్న మిడిలార్డర్..**

నాలుగు టీ20ల సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో మ్యాచ్‌లో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ ఇండియా.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. తిలక్ వర్మ (20), అక్షర్ పటేల్ (27), హార్దిక్ పాండ్య (39ని) మినహా మిగతా వారెవరూ రాణించలేదు. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్‌సెన్, కొయెట్జీ, సైమ్‌లేన్, మార్‌క్రమ్, పీటర్ తలో వికెట్ తీశారు.

తొలి మ్యాచ్‌లో చెలరేగిన బ్యాటర్లు ఈసారి పేలవ ప్రదర్శన చేశారు. 15 పరుగులకే టీమ్ ఇండియా కీలకమైన 3 వికెట్లను కోల్పోయింది. తొలి మ్యాచ్‌లో శతక్కొట్టిన సంజు శాంసన్.. ఈ మ్యాచ్‌లో పరుగులేమీ చేయకుండానే వెనుదిరిగాడు. జాన్‌సన్ వేసిన తొలి ఓవర్ మూడో బంతికే బౌల్డయ్యాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (4) కూడా విఫలమయ్యాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (4) కూడా నిరాశపరిచాడు. దీంతో భారత్ జట్టు ఒక్కసారిగా కష్టాల్లోకి కూరుకుపోయింది. ఒక ఫోర్, సిక్సర్‌తో టీమ్ ఇండియాలో జోష్ పెంచిన తిలక్ వర్మ (20)ను మార్‌క్రమ్ పెవిలియన్‌కు చేర్చాడు.

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన అక్షర్ పటేల్ (27) నిలదొక్కుకుంటున్న తరుణంలో అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్య (39ని) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ మోస్తరు స్కోరు చేయగలిగింది.

# పాకిస్థాన్‌కు వెళ్లం

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌కు భారత క్రికెట్ జట్టును పంపే అవకాశమే లేదని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి బీసీసీఐ స్పష్టం చేసింది. పాకిస్థాన్‌కు జట్టును పంపేందుకు భారత ప్రభుత్వ అనుమతి లేదని, ఆ దేశంలో ఛాంపియన్స్ ట్రోఫీ ఆడలేమని ఐసీసీకి భారత బోర్డు (%దీజజ×%) తెలిపినట్లు సమాచారం. 2008 ముంబయి దాడుల అనంతరం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించనేలేదు. ద్వైపాక్షిక సిరీస్‌లు, బహుళ దేశాల టోర్నీల కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఎన్నిసార్లు విన్నవించినా బీసీసీఐ ఆ దేశానికి జట్టును పంపలేదు. అయితే వచ్చే ఏడాది ఫిబ్రవరి 19-మార్చి 9 మధ్య తాము ఆతిథ్యమివ్వబోయే ఛాంపియన్స్ ట్రోఫీకి ఎలాగైనా భారత జట్టును రప్పించాలని పీసీబీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఏదైనా ఒక్క వేదికలోనే భారత్ మ్యాచ్‌లు ఏర్పాటు చేసి అత్యున్నత స్థాయి భద్రత కల్పిస్తామని చెబుతూ వస్తోంది. భారత్‌ను ఒప్పించేలా ఐసీసీ మీద ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. కానీ బీసీసీఐ మాత్రం పాకిస్థాన్‌కు జట్టును పంపేందుకు ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలో తమ నిర్ణయాన్ని ఐసీసీకి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ ఆడే మ్యాచ్‌లు మాత్రం యూఏఈలో లేదా మరో తటస్థ వేదికలో నిర్వహించేలా హైబ్రిడ్ మోడల్‌ను ఎంచుకోవడం తప్ప పీసీబీకి మరో ప్రత్యామ్నాయం లేనట్లే. అయితే బీసీసీఐ నిర్ణయంపై ఐసీసీ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీబీ చెబుతోంది.